క్లుప్తంగా

ముద్ర లోన్ పేరిట రూ. 1.27 లక్షల మోసం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముద్ర లోన్ పేరిట రూ. 1.27 లక్షలు మోసం చేసిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హనుమాన్‌నగర్‌కు చెందిన దాసరి సాయిలక్ష్మి టైలరింగ్ చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 10వ తేదీన మొబైల్ చూస్తుండగా యూట్యూబ్‌లో ముద్ర లోన్ యాడ్ వచ్చింది. దీంతో యాడ్ లింక్‌ను సాయిలక్ష్మి ఓపెన్ చేసి అందులోని దరఖాస్తు వివరాలను పూర్తి చేశారు. ఆ తర్వాత ఒక అపరిచిత వ్యక్తి సాయిలక్ష్మికి ఫోన్ చేసి ముద్ర లోన్ శాంక్షన్ అయిందని, వాట్సప్ ద్వారా వివరాలు పంపించాలని చెప్పారు. దీంతో వారు అడిగిన వివరాలను సాయి లక్ష్మి వాట్సప్ ద్వారా పంపించారు. తరువాత రుణం మంజూరు కోసం డాక్యుమెంట్ ఫీజు కట్టాల్సిందిగా కోరారు. దీంతో ఆమె విడతల వారీగా లోన్ అప్రూవల్ కోసం రూ. లక్షా 27వేలు అపరిచిత వ్యక్తి ఖాతాకు పంపించారు. అయినప్పటికీ లోన్ మంజూరు కాకపోవడంతో సాయిలక్ష్మి మోసపోయినట్లు గ్రహించారు. రుణం పేరిట మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తన డబ్బులు తిరిగి ఇప్పించాలంటూ శుక్రవారం సాయిలక్ష్మి గుణదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరుణా సముద్రుడు శ్రీనివాసుడు



విజయవాడ కల్చరల్: కరుణా సముద్రుడు శ్రీనివాసుడని ఆగమ అద్వైత పండితులు మోహన రంగాచార్యులు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలో నాలుగు రోజులపాటు నిర్వహించే భోగ శ్రీనివాసుని విగ్రహానికి సంప్రోక్షణా కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రంగాచార్యులు మాట్లాడుతూ కోట్లాది హిందువులు తమ ఇష్టదైవంగా భావిస్తారని తెలిపారు. భారతీయ వైదిక ధర్మం విశిష్టమైదన్నారు. లోక కల్యాణం కోసం భోగశ్రీనివాసునికి నాలుగు రోలులపాటు ఆగమోత్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. భగవత్ ప్రార్థనతో వైదిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆచార్య రుత్విక్ వరణ, మేదినీ పూజ మృత్సగ్రహణం, అంకురార్పరణ వేదారంభం, యాగశాల సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయ అర్చక స్వామి మురళీ ఆచార్య, వేంకటాయ పాలెం ఆలయ అర్చక స్వాములు పాల్గొన్నారు. టీటీడీ వేదపండితులు చతుర్వేదాలను పఠించారు. దేవాలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి పర్యవేక్షించారు.

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి

నాస్కామ్ రీజినల్ హెడ్ ప్రవీణ్‌కుమార్



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీ(నాస్కామ్) ఏపీ, తెలంగాణ రీజినల్ హెడ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మహాత్మా గాంధీ రోడ్డులోని శ్రీ దుర్గమల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో శుక్రవారం టెక్‌స్పార్క్స్ 2కే 24 పేరుతో రాష్ట్రస్థాయి టెక్నికల్ ఈవెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రవీణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్, సేవల పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తూ, పరిశ్రమల ప్రమాణాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపునకు వివిధ సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు టెక్ బ్లెండ్జీ, టెక్నో ఫియస్టా(క్విజ్), డంబ్‌యాక్ట్స్, స్టడ్ వెబర్(క్రియేటింగ్ వెబ్‌పేజీ), లోగో డిజైనింగ్, షార్ట్‌ఫిల్మ్స్, రీల్స్, సైబర్ ఎటాక్స్ వంటి అంశాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్. మాధవి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

28న కవన విజయం సాహిత్య రూపకం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 28వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు కవన విజయం పేరుతో ఆధునిక సాహిత్య రూపకం, 30 తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు సిద్ధార్థ ఆడిటోరియంలో రాజమండ్రికి చెందిన గాడేపల్లి వెంకట్ బృందం తిరుమంగై ఆళ్వార్ దివ్య కథ పేరుతో కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన నిర్వహిస్తారని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు కార్యక్రమాలను తిలకించవచ్చని పేర్కొన్నారు.

నడవాలన్నా... నరకయాతనే..!

- మా కాలనీల్లో రోడ్లు వేయండి.. మహాప్రభో అంటున్న శివారు కాలనీల ప్రజలు
- నందమూరినగర్, సన్‌సిటీ కాలనీ, ఇందిరానాయక్‌నగర్ ప్రాంతాల్లో రహదారులు లేక అవస్థలు
- రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో రోడ్లు సరిగా లేకపోవడంతో స్థానిక ప్రజలు నిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం నడవాలన్నా నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రధానంగా బుడమేరు వరదల తరువాత ఇక్కడున్న కొన్ని రహదారులు తటాకాలను తలపించడంతో స్థానిక ప్రజలే వాటిల్లో మట్టిని పోసుకొని వారి రాకపోకలకు మార్గాలను ఏర్పాటుచేసుకున్నారు. రోడ్లపై మట్టి, రాళ్లు అధికంగా ఉండడంతో రాత్రి సమయంలో ఈ రోడ్లపై పడిపోయి ప్రమాదాల భారిన పడుతున్నారు. బుడమేరుకు ఆనుకొని ఉన్న ఇందిరానాయక్‌నగర్, షణ్ముఖనగర్, సన్‌సిటీ కాలనీ, భరతమాతకాలనీ, నందమూరినగర్, తోటవారి వీధి, న్యూఆర్‌ఆర్‌పేట అపార్ట్‌మెంట్స్ వెనుక భాగం, సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని పలు వీధుల్లో రోడ్లు లేవు. దీంతో రోడ్లపై రాళ్లు, గోతులు ఉండడంతో స్థానిక ప్రజలు ఆ ప్రాంతాల్లో పాదచారులు సైతం నానా అవస్థలు పడుతున్నారు.

రోడ్లపైనే మురుగునీరు.....

బుడమేరు వరద ముంపు తరువాత సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు బయటకు వచ్చి రోడ్లపై ప్రవహిస్తుంది. అలానే కొన్ని వీధుల్లో ఉన్న గోతుల్లో వర్షపునీరు చేరి అలానే ఉండిపోయాయి. వీటి నుంచి వస్తున్న దుర్వాసనతో స్థానిక ప్రజలు ఇళ్లల్లో కూడా ఉండలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ ద్విచక్ర వాహన చోదకులు ఈ గోతులు, మురుగునీళ్లలో జారి గాయాలపాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

గతంలో భళా.. నేడు డీలా....

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 58వ డివిజన్‌లో రోడ్డు నిర్మాణ పనులు అధిక మొత్తంలో జరిగాయి. విస్తీర్ణపరంగా ఈ డివిజన్‌లో మొత్తం శివారు ప్రాంతాలే ఉండడం.... ఆయా ప్రాంతాల్లో రహదారులు లేకపోవడంతో గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ కావడం.. కొత్తగా ఏర్పడిన ఈ కాలనీల్లో వేలమంది ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఇక్కడ అనేక బీటీ రోడ్లు, తారు రోడ్లను నిర్మించారు. అయితే ఇదే డివిజన్‌లో ఇంకా పలు ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, సంబంధిత ఉన్నతాధికారులు రహదారులు లేక తాము పడుతున్న అవస్థలను గుర్తించి మా ప్రాంతాల్లో రోడ్లను వేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రాళ్లతో నిండిన సన్‌సిటీ కాలనీలోని ఓ రోడ్డు



షణ్ముఖ నగర్‌లో రహదారి దుస్థితి



భరతమాత కాలనీలో అధ్వానంగా ఉన్న ఏదో లైన్ రహదారి

నగరాభివృద్ధికి నిరంతర కృషి

- మేయర్ భాగ్యలక్ష్మి
- కమాండ్ కంట్రోల్ రూంలో స్థాయీ సంఘ సమావేశం



మేయర్ ఆధ్వర్యంలో జరిగిన వీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని మరింత అభివృద్ధి చేయటానికి నిరంతరం కృషి చేస్తున్నామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో శుక్రవారం మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యాన స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో మొత్తం 20 అంశాలు ప్రతిపాదన రాగా అందులో 18 అంశాల్ని ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా, మరో అంశాన్ని ధ్రువీకరించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విజయవాడ నగరంలోని 64 డివిజన్లలో పక్షపాతం లేకుండా అభివృద్ధి చేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు సమీకరిస్తామన్నారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు, స్థాయీసంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రధానాంశాలు :

- వీఎంసీ పరిధిలోని ఆయా డివిజన్లలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేయటానికి, రోడ్లు స్వీపింగ్ చేసిన తర్వాత వచ్చే వ్యర్థాల పోగులను లోడర్ పాయింట్‌వద్దకు చేర్చేందుకు డివిజన్లలో పారిశుద్య కార్మికులకు అందించే మూడు చక్రాల ట్రాలీలు తయారీ, సరఫరా చేయటానికి రూ. 74.71 లక్షల అంచానాలను వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించి, ఖర్చు చేసేందుకు వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- నగరంలోని 64 డివిజన్లలో వచ్చే వ్యర్థాలను క్లాప్ వాహనాలు, కాంపాక్టర్ బిన్స్ ద్వారా నగరంలోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వ్యర్థాల తరలింపు జరుగుతుంది. ప్రస్తుతం ఉన్న కాంపాక్ట్‌బిన్స్ పూర్తిగా తుప్పుపట్టాయని, వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు అవసరమయ్యే రూ. 48.03 లక్షలు వ్యయాన్ని వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి నిధులు కేటాయించి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

మాతా శిశు సేవల్లో ప్రగతి సాధించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్య సిబ్బంది మాతా శిశు సేవలు, ఎన్‌సీడీ-సీడీ సర్వే-3లో ప్రగతి సాధించి లక్ష్యాలు చేరుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సందర్శించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మధ్యాహ్న భోజనం ఏర్పాటు, మెనూ నిర్వాహణ వంటి అంశాలను తనిఖీ చేశారు. పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ బిల్లల పంపిణీని అడిగి తెలుసుకున్నారు. వ్యాధుల నియంత్రణపై సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు.

అధికారులతో సమీక్ష

జిల్లా ప్రోగ్రాం అధికారులతో నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో పలు అంశాలపై డాక్టర్ సుహాసిని సమీక్ష నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాల ప్రగతి, మాతా శిశు సంరక్షణ సేవలు లక్ష్యాలను చేరుకోవడం, ఈ ఆశా యాప్ నిర్వాహణ వంటి అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవీనాయుడు, డాక్టర్ పద్మావతి, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీర, డాక్టర్ బాలాజీ, గణాంక అధికారి లక్ష్మోజీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఫల, పుష్ప ప్రదర్శన



ప్రదర్శనలో రంగుల పుష్పాల్లోని ఆకృతులను చూస్తున్న విద్యార్థినులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నగర పాలక సంస్థ, అర్బన్ గ్రీనరీ, ఉద్యానవనశాఖ సహకారంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. ప్రదర్శనలో వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి విచ్చేసిన చామంతులు, గులాబీలు, మందార, నారింజ, మామిడి, జామ, ఫల, పుష్ప మొక్కలతో పాటు, కుండీల్లో, ఇంట్లో అలంకరణగా ఏర్పాటు చేసే మొక్కలను వివిధ స్టాల్స్‌లో ఏర్పాటు చేశారు. ప్రదర్శనలోని పలు మొక్కలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ప్రముఖ ఉద్యనవనాలకు చెందిన వారంతా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శనలో తొలిరోజు విద్యార్థులకు ఫ్లవర్ రంగోలి పోటీలు నిర్వహించగా, పలు పాఠశాలల, కళాశాలల నుంచి విద్యార్థినులు విచ్చేసి, ఆకర్షణీయమైన పువ్వులతో రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ పాల్గొని, రోజ్ సొసైటీ సభ్యులు ఎస్.ఉషారాణి, జి.లక్ష్మి, ఎస్.పద్మప్రియ, ఎ.రత్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు..



పుష్పాలు అలంకరిస్తున్న యువతులు

దుర్గమ్మ చెంత భక్తి సంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో తిరుపతికి చెందిన మన సంస్కృతి కళా సంస్థకు చెందిన కళాకారులు భక్తి సంగీతాన్ని ఆలపించారు. కె.రెడ్డెప్ప పర్యవేక్షణలో నాగమణి, రుక్మిణి, రాజశేఖర్, మోగితేశ్వరి, గీతతో పాటు పలువురు కళాకారులు కీర్తనలను ఆలపించారు. కళాబృందానికి భక్తుల ప్రసంశలు అందాయి. అనంతరం భక్త బృందం సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం డీఈవో రత్నరాజు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

రైల్వే సంఘాల ఎన్నికల ప్రచార జోరు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వేలో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలకు రైల్వే బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయడంతో విజయవాడ డివిజన్‌లో పలు కార్మిక సంఘాల తమ గుర్తింపు కోసం హోరాహోరీగా ప్రచారం మొదలుపెట్టాయి. డిసెంబర్ 4,5,6 తేదీలలో జరగనున్న ఈ ఎన్నికల్లో ఎన్ఎఫ్ఐఆర్ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్)లో భాగస్వామి అయిన దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, ఏఐఆర్ఎఫ్ (ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్)లో భాగస్వామి అయిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లు ప్రధానంగా పోటీలో ఉండగా.. దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం (డీఎంఆర్‌కేఎస్) తమ గుర్తింపు కోసం మొదటిసారిగా పోటీలో నిలిచి ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అందులో భాగంగా ఆయా కార్మిక సంఘాలు విజయవాడ డివిజన్‌లో ప్రచారం చేసుకుంటున్నారు.

సైన్స్ అంశాలు అర్థమయ్యేలా చూడాలి



ప్రయోగశాలను పరిశీలిస్తున్న జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉపాధ్యాయులు ప్రయోగాల ద్వారా సైన్స్ అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా చూడాలని జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ పాఠశాల్లో ప్రయోగశాలలను మైనం హుస్సేన్ పరిశీలిస్తున్నారు. నగరంలోని వివిధ పాఠశాల్లోని ప్రయోగశాలలను ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఫ్రైడే- ఒక ప్రయోగం నినాదంతో సైన్స్ బోధిస్తున్న ఉపాధ్యాయులు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర, జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు అందరు సైన్స్ ఉపాధ్యాయులు బోధన మెరుగు పరచుకోవాలన్నారు. లైట్, కరెంటు, మెకానిక్స్, కెమికల్ రియాక్షన్, ఆసిడ్ అండ్ బేస్, కార్బన్ కాంపౌండ్స్, మెటల్ అండ్ నాన్ మెటల్ అంశాలు నిత్యాజీవిత ఉపయోగాలు చెప్పాలన్నారు. విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించడానికి తీర్చిదిద్దాలని కోరారు.

అదానీకి కేటాయించిన కాంట్రాక్ట్‌లు రద్దు చేయాలి

ఆప్ పార్టీ కోఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



మాట్లాడుతున్న నేతి మహేశ్వరరావు, వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీలో అదానీకి కేటాయించిన కాంట్రాక్టులన్నింటినీ రద్దు చేయాలని ఆప్ పార్టీ జోన్ సి కోఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అదానీకి ఇచ్చిన పవర్ కాంట్రాక్టులు, గంగవరం, కృష్ణపట్నం పోర్టుల కాంట్రాక్టులను వెనక్కు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీలో నారా లోకేష్ దీని మీద చర్చించాల్సిన అవసరం లేదని మాట్లాడడం... అలాగే టీడీపీ నుంచి ఎలాంటి ప్రకటనలు రాకపోవడం చూస్తే రాష్ట్రాన్ని అదానీ పాలిస్తున్నాడా అన్న అనుమానం కలుగుతోందని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఈ మధ్య అదానీని ఆయన కార్పొరేట్ ఆఫీసులో కలవడం, రాష్ట్రంలో పెట్టుబడి పెడతారని చెప్పడం చూస్తుంటే ఈ పార్టీలకు సుప్రీం అదానీనే అన్న సందేహం కలుగుతోందన్నారు. ఈ దేశ ప్రజాస్వామ్యం ఆర్థిక మాఫియా కబంధ హస్తాల్లోకి వెళ్లిందన్నారు. తక్షణమే బీజేపీ రాజ గురువు ఆర్ఎస్ఎస్ స్పందించి మోడీని ప్రధాని పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నరుపేట విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ అరండల్‌పేట ఫీడర్, అన్నదాన సమాజం రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 23వ తేదీ శనివారం ఉదయం 7:00 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రెహమాన్ వీధి, కోదండరామిరెడ్డి వీధి, వెంకటేశ్వరరావు వీధి, రామ మందిరం వీధి, శేషాద్రి శాస్త్రి వీధి, హుస్సేన్ సాహెబ్ వీధి, జానీ వీధి, యాసిన్ వీధి, గోగవారి వీధి, చింతా వారి వీధి, దాసు వారి వీధి, మసీదు వీధి, జలీల్ వీధి, దుర్గయ్య వీధి, మొహిద్దీన్ వీధి,అన్నదాన సమాజం రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సూర్యారావుపేట సెక్షన్ ..

శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి, బోయపాటి వారి వీధి, జడగం వారి వీధి, వేమూరి వారి వీధి, గోపరాజు వీధి, డోర్నకల్ రోడ్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

డోర్నకల్ రోడ్ ఫీడర్ పరిధిలో....

ఉదయం 7:30 గంటకు ఒకసారి మధ్యాహ్నం 12:00 గంటలకు ఒకసారి 30 నిమిషాలు చొప్పున స్టేట్ గెస్ట్ హౌస్, గోపాలరెడ్డి రోడ్డు, ప్రకాశం రోడ్డు, డోర్నకల్ రోడ్డు, కాశేశ్వరావు రోడ్, గోవిందరాజులు నాయుడు వీధి, నరసింహారావు నాయుడు వీధి, వేమూరి వారి వీధి, జడగం వారి వీధి సరఫరా నిలిచిపోతుంది.

కస్తూరిబాయిపేట ఫీడర్ పరిధిలో....

ఉదయం 7:30 గంటలకు ఒకసారి మధ్యాహ్నం 12:00 గంటలకు ఒకసారి 30 నిమిషాలు చొప్పున టుబాకో బ్యారెన్ స్ట్రీట్, డాక్టర్ యన్.సుబ్బారావు వీధి, దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి. ప్రకాశం రోడ్‌లో ఉదయం 7:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటలవరకు గోపాలరెడ్డి రోడ్ లోని రైల్వే క్లబ్, రైల్వే క్వార్టర్స్, రైల్వే ఫంక్షన్ హాల్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, సైబర్ క్రై మ్ పోలీస్ ఆఫీస్ ,పోలీస్ ఇంటెలిజన్స్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముత్యాలంపాడు సెక్షన్ ప రిధిలో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ అల్లూరి సీతారామరాజు రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎస్ రాజు రోడ్డు, దేవాలయం వీధి, వానపాల వారి వీధి, కనకరాజు వీధి, కొమ్మువారి వీధి, రామరాజు వీధి, పాపరాజు వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మల్లేశ్వరుడికి డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి శుక్రవారం పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు విశేష అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చనను శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు.



సహస్ర లింగార్చన చేస్తున్న ఆలయ అర్చకులు



స్వామి వారికి విశేష అలంకరణ

27న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం సాంబమూర్తి రోడ్డులోని అయ్యప్ప స్వామి మందిరంలో ఈ నెల 27వ తేదీ బుధవారం శ్రీమణికంఠ భక్త బృందం ఆధ్వర్యాన సామూహిక శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు గురుస్వామి బల్లెం పూర్ణయ్య స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తిక మాసంలో సత్యనారాయణ స్వామి వ్రతం విశేషం అన్నారు.

అటువంటి వ్రతం ప్రతి ఒక్కరూ చేసుకోవాలనే ఉద్దేశంతో సామూహిక వ్రతాలు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు మందిరంలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్రతంలో పాల్గొనదలచిన వారు సంప్రదాయ దుస్తులతో రావాలని సూచించారు.

రేపు లక్ష దీపోత్సవం



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): కార్తిక మాసం సందర్భంగా ఈ నెల 24వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఆవు పేడతో తయారు చేసిన ప్రమిదలతో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామని నారాయణీ సేన చైర్మన్, లక్ష దీపోత్సవ కార్యక్రమ కమిటీ కన్వీనర్ పిట్టల గోవింద్ చెప్పారు. దీపోత్సవ కరపత్రాన్ని విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. గోవింద్ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ విజయవాడ మహానగర్, నారాయణీ సేన సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి హాజరై కార్తిక మాస విశిష్టత వివరిస్తారని చెప్పారు. దీపోత్సవంలో పాల్గొన్న వారికి కాశీ నుంచి తెచ్చిన రుద్రాక్ష అందజేస్తామని చెప్పారు. దీపోత్సవంలో పాల్గొనదలచిన వారు 77949 78373 నంబరులో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఆర్ఎస్ఎస్ కార్యవాహ పడాల శ్రీనివాస్, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, నారాయణీ సేన సంస్థ సభ్యులు కరపత్రం ఆవిష్కరణలో పాల్గొన్నారు.